భిక్షాటనతో పిల్లల భవిష్యత్తు నాశనం చేయొద్దు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : భిక్షాటనతో చిన్నారుల జీవితాలను నాశనం చేయవద్దని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ అన్నారు. నగరంలోని ప్యారడైజ్, ప్యాట్నీ, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, అఫ్జల్‌గంజ్, ఐఎస్ సదన్, మలక్‌పేట్, చాంద్రాయణ గుట్ట, పెద్దమ్మ దేవాలయం తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్న వీధి బాలలు, వారి తల్లులను ప్రత్యేక డ్రైవ్ ద్వారా గుర్తించారు. కాచిగూడ నింబోలిగడ్డలోని జువైనల్ బాలికల హోం నుంచి వారి ప్రాంతాలకు తరలించే కార్యక్రమాన్ని కలెక్టర్ మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. 19 మంది చిన్నారులు, ఆరుగురు తల్లులను వారి గ్రామాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి అక్వేశ్వరరావు, బాలికల హోం సూపరింటెండెంట్ కృష్ణవేణి, బాలరక్ష భవన్ అధికారి సుమలత, తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీ అధికారులతో సమావేశమైన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్

నేడు ఉప్పల్‌లో
ఐపీఎల్ ఫైట్

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : నగరంలోని అన్ని దారులు ఉప్పల్ స్టేడియం వైపునకే చూపిస్తున్నాయి. బుధవారం సన్ రైజర్స్ హైదరాబాద్, ముంబాయి ఇండియన్స్ జట్లు తలపడనున్నాయి. ఇప్పటికే ఐపీఎల్ మ్యాచ్‌లు వీక్షిస్తూ సందడి చేస్తున్న నగర అభిమానులు.. సొంతగడ్డపై సన్ రైజర్స్ హైదరాబాద్ తొలి మ్యాచ్ కావడంతో వీక్షించేందుకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. అందులో భాగంగా గ్రేటర్ ఆర్టీసీ క్రికెట్ అభిమానుల కోసం నగరంలోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడపనున్నది. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ శాఖకు పిల్లి శకునం

గంటన్నరపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : అంతరాయం లేని విద్యుత్ సరఫరా లక్ష్యంగా పనిచేస్తున్న విద్యుత్ శాఖకు పిల్లి శకునంగా మారింది. మంగళవారం ఉదయం 7 గంటలకు సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని నందనవనం సబ్ స్టేషన్‌లో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ (పీటీఆర్)కు అనుసంధానమై ఉన్న పవర్ బ్రేకర్ లింబ్‌పై పిల్లి దూకడంతో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆ సబ్ స్టేషన్ పరిధిలోని 12 ఫీడర్ల పరిధిలో సుమారు గంటన్నర పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు సబ్ స్టేషన్‌కు చేరుకొని మరమ్మతులు చేపట్టారు.

సికింద్రాబాద్ ఎంపీ పజ్జన్న

తొలిసారిగా లష్కర్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురబోతోంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌లో చేసింది కురుకురే ప్యాకెట్లు పంచడమే

ప్రజలను మోసంచేసిన దానంకు బుద్ధి చెప్పాలి

రాబోయే 53 రోజులు కార్యకర్తలు, నేతలంతా ప్రజల్లోనే ఉండాలి

పద్మారావు గెలుపులో కంకణబద్ధులై పనిచేయాలి

కేటీఆర్ వ్యాఖ్యలతో క్యాడర్‌లో మరింత జోష్

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : నగరానికి సుపరిచితులు.. రాజకీయాల్లో సికింద్రాబాద్ అంటేనే గుర్తుకొచ్చే పేరు పద్మారావు.. కాబోయే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ పజ్జన్న అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. తొలిసారిగా సికింద్రాబాద్ పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగురబోతున్నదని కేటీఆర్ అన్నారు. 24 ఏండ్లుగా పద్మారావుగౌడ్ పార్టీకి నగరంలో అండగా ఉన్నారని, ఎంపీ అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటన అయిన రెండు గంటల వ్యవధిలోనే మంచినిర్ణయం తీసుకున్నారని, ప్రతి కార్యకర్తకు, నాయకుడికి విశ్వాసం కలిగిందంటూ పదుల సంఖ్యలో తానకు ఎస్ఎంఎస్‌లు వచ్చాయని కేటీఆర్ చెప్పారు. సికింద్రాబాద్‌లో పోటీ ఒక విఫల ఎంపీ కిషన్‌రెడ్డి, అవకాశవాద ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు, ఇంకోవైపు నిబద్ధత కలిగిన పద్మారావు మధ్య ఉన్నదని వివరించారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం విస్తృతస్థాయి సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాబోయే 53 రోజుల పాటు కార్యకర్తలు, నేతలంతా ప్రజల్లోనే ఉండి పద్మారావు గెలుపులో కంకణబద్ధులై పనిచేయాలని పిలుపునిచ్చారు.

దానంను అనర్హుడిగా ప్రకటించకుంటే సుప్రీం కోర్టుకు

రాజకీయాల్లో హత్యలుండవు.. ఆత్మహత్యలే ఉంటాయని, దానం నాగేందర్ తీసుకున్న నిర్ణయం తప్పు అని తెలిసేలా మనం ఎన్నికల్లో గెలిచి చూపించాలని కేటీఆర్ అన్నారు. దానం నాగేందర్ ఆధికారానికి ఆశపడి గెలిపించిన ప్రజలకు ద్రోహం చేసి వెళ్లాడని, ఖైరతాబాద్ ప్రజలే మన పార్టీని గెలిపించి, ఆయన నిర్ణయం తప్పని నిరూపిస్తారన్న నమ్మకం తనకు ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. దానం నాగేందర్‌పైన ఇప్పటికే స్పీకర్‌ను కలిసి ఫిర్యాదు చేశామని, ఆయనను అనర్హుడిగా ప్రకటించకపోతే సుప్రీంకోర్టు దాకా వెళ్లి మరీ అనర్హుడిగా ప్రకటించేలా చేస్తామని తెలిపారు.

మూడు, నాలుగు నెలల్లోనే ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక

మూడు, నాలుగు నెలల్లోనే ఖైరతాబాద్‌కు ఉప ఎన్నిక వస్తుందని, ప్రజలు దానికి సిద్ధంగా ఉండాలని, ద్రోహం చేసిన వారికి బుద్ధి చెప్పాలని కేటీఆర్ అన్నారు. సికింద్రాబాద్‌లో మన పోటీ కాంగ్రెస్‌తో లేనే లేదని, దానం నాగేందర్‌ను ప్రజలు సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. ఇక కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి అతిపెద్ద మూడు పనులు నియోజకవర్గానికి చేశారని విమర్శించారు. కురుకురే ప్యాకెట్లు పంచడం, సీతాఫల్‌మండిలో రైల్వే లిఫ్ట్ ఓపెన్ చేయడం, సింటెక్స్ ట్యాంకులను ఓపెన్ చేయడం తప్ప హైదరాబాద్‌కు ఆయన చేసిందేమి లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఆయన సొంత నియోజకవర్గం అంబర్‌పేటలో కనీసం ఫ్లై ఓవర్‌ను పూర్తి చేయలేకపోయాడని మండిపడ్డారు.

ఉద్యమాలు, పోరాటాలు బీఆర్ఎస్‌కు కొత్తేమీ కాదు
- ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

బీఆర్ఎస్ పార్టీకి ఉద్యమాలు, పోరాటాలు కొత్త కాదని, ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ విధానాలపైన పోరాడుతామని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్ అన్నారు. లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, నాయకుల కృషి, శ్రమ, త్యాగం వల్లనే ఈ రోజు బీఆర్ఎస్ పటిష్టంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలకు పార్టీ అధికంగా అవకాశం ఇచ్చిందని, బీసీలంతా ఏకమై బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని పద్మారావు గౌడ్ పిలుపునిచ్చారు.

సమష్టిగా పనిచేద్దాం.. పద్మారావును గెలిపిద్దాం
- తలసాని శ్రీనివాస్ యాదవ్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో విద్యుత్, నీటి కష్టాలు మొదలయ్యాయని మాజీ మంత్రి, సనత్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడం మరిచిందని విమర్శించారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, కార్యకర్తలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలలో సమష్టిగా పని చేసి సికింద్రాబాద్ నియోజకవర్గం అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజలతోనే ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం బిల్లులు పంపుతుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను వందరోజుల్లో అమలు చేస్తామని చేయలేదని, పార్లమెంట్ ఎన్నికల అనంతరం ప్రజల పక్షాన ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, హైదరాబాద్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ దాసోజు శ్రవణ్, మాజీ చైర్మన్ రావుల శ్రీధర్ రెడ్డి, కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

శునకాల బెడద నివారణపై వెటర్నరీ అధికారులకు కమిషనర్ సూచనలు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలు సురక్షితంగా ఉండేలా జీహెచ్‌ఎంసీ పటిష్టమైన చర్యలు చేపట్టిందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ తెలిపారు. జీహెచ్ ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో అడిషనల్ కమిషనర్ రవికిరణ్, వెరట్నరీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశమై వీధి కుక్కల బెడద, కుక్క కాటు నివారణకు చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం చర్చించారు. ప్రజలకు రక్షణ కల్పించడానికి వెటర్నరీ శాఖ వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెగ్యులర్‌గా వ్యాక్సిన్ వేయాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో వెరట్నరీ చీఫ్ డాక్టర్ అబ్దుల్ వకీల్, బ్లూ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అక్కినేని అమల, కుమారి, పీపుల్ యానిమల్స్ ప్రతినిధి వి.వాసంతి, కమెండో కెన్నల్స్ ఫిలిప్ బట్, యానిమల్ ఎయిడ్ సొసైటీ ప్రతినిధి అర్చననాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ @ 38.2డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 26 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38.2డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24.5డిగ్రీలు, గాలిలో తేమ 30శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా!

మరోమారు గులాబీ జెండా ఎగురవేద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి, చిత్రంలో ఎంపీ అభ్యర్థి కాసాని, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది

- తప్పుడు హామీలతో గద్దెనెక్కి.. ప్రజలను నట్టేట ముంచుతున్నరు - విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలకు బీఆర్ఎస్ శక్తి చూపించాలి
- కేసీఆర్ సర్కార్ హయాంలో సాగు, తాగునీటికి కరువే లేదు
- కోడి గుడ్డుపై ఇకలు పీకినట్లుగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన
- కలిసికట్టుగా పనిచేద్దాం.. కాసానిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

-సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి

"కాంగ్రెస్ అంటే.. కరువు, ఆకలి కేకలు, తాగునీటి దప్పికలు, అడ్డగోలు అక్రమాలు ఇవన్నీ ఆ పార్టీకి పెట్టింది పేరు. ప్రజలకు తప్పుడు వాగ్దానాలను ఇచ్చి అధికారం చేపట్టిన వందరోజుల్లోనే తెలంగాణకు కరువు పట్టింది. కరెంటు పోయింది. ఎక్కడ చూసినా అక్రమార్కుల వితండాలు జరుగుతున్నాయి. ప్రజాసంక్షేమం అటకెక్కింది. ఇలాంటి ప్రజా వ్యతిరేక పాలనను ప్రజలంతా తిప్పికొట్టేందుకు సన్నద్ధం అయ్యారని" నార్సింగిలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో నేతలు అన్నారు."

మణికొండ, మార్చి 26 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు, రైతు భీమా, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఇచ్చి పేదలకు మేలు చేస్తే.. అంతకంటే బాగా చేస్తారే మోనని కాంగ్రెస్‌ను నమ్మి ఎన్నికల్లో గెలిపిస్తే మమ్మల్ని నట్టేట ముంచారని ప్రజలు వాపోతున్నారని రాష్ట్ర మాజీ విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశం మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధి నార్సింగిలోని ఓం కన్వెక్షన్‌లో ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేవెళ్ల అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రస్తుతం బరిలో ఉన్న విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే గుర్తింపు వచ్చిందని, ఎందుకు పార్టీ మారారో తెలియదు కానీ.. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల శక్తిని వారు తక్కువగా అంచనా వేశారని, పార్టీని వీడిన వారికి మన శక్తి చూపించాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. రంజిత్‌రెడ్డి అంటే ఎవరో కూడా ప్రజలకు తెలియదని, అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి పంపిస్తే చేవెళ్ల ప్రజలు శ్రమించి గెలిపించారని గుర్తు చేశారు. అలాంటి విశ్వాసం లేని వ్యక్తులకు చేవెళ్ల ప్రజలు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లా జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రజల్లో ఉంటూ సేవలందించారని, కాసానిని అఖండమైన మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు.

రేవంత్‌ది కోడిగుడ్డుపై ఈకలు పీకే రకం

పది సంవత్సరాలల్లో బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధిపొందారని ఎమ్మెల్యే సబితారెడ్డి గుర్తుచేశారు. కేసీఆర్ సర్కారు హయాంలో నార్సింగిలో ఇంటర్ చేంజ్ ఏర్పాటు చేయడంతో పాటు అవుటర్ చుట్టూ సైక్లింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ సర్కారు తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్‌పై కక్షపూరితంగా వ్యవహరిస్తూ బద్నాం చేయడమే లక్ష్యంగా పనిచేస్తుంది తప్ప.. ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణలో కేసీఆర్ నిషాన లేకుండా చేస్తానంటూ సీఎం రేవంత్ ఓవర్‌గా మాట్లాడుతున్నారని.. అనునిత్యం కోడి గుడ్డుపై ఇకలు పీకినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ నిషాన లేకుండా చేయాలంటే తెలంగాణనే మార్చాలని, రైతు బంధు, రైతు భీమా, కల్యాణలక్ష్మిలను కూడా లేకుండా చేస్తారా.. అంటూ ప్రశ్నించారు. బడుగుల ఆశాజ్యోతిగా ఉన్న కాసానిని సమిష్టిగా శ్రమించి బీఆర్ఎస్ సత్తా ఏమిటో చూపిస్తూ చేవెళ్ల గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నార్సింగి, శంషాబాద్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్లు రేఖాయాదగిరి, సుష్మారెడ్డి, మాజీ ఎంపీపీ మల్లేశ్, మున్సిపల్ వైస్ చైర్మన్లు వేణుగోపాల్‌యాదవ్, వెంకటేశ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు నర్సింహ, చంద్రారెడ్డి, కౌన్సిలర్లు పత్తిప్రవీణ్‌కుమార్, శివారెడ్డి, శ్రీకాంత్, ఉషారాణి, రామకృష్ణారెడ్డి, అరుణజ్యోతి, శంషాబాద్, రాజేంద్రనగర్, గండిపేట మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మీలో ఒకరిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్



చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను బరిలో దింపిన కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు. మీలో ఒక్కడిగా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం శక్తి వంచనలేకుండా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి చేవెళ్ల ప్రజలు సరియైన బుద్ధిచెప్పాలన్నారు. వందరోజుల్లో ఏ ఒక్క హామీ నెరవేర్చని రేవంత్ సర్కారు మిగతారోజుల్లో ప్రజలకు ఏవిధంగా సేవలందిస్తారని ప్రశ్నించారు. ప్రణాళిక లేని పాలన రాష్ట్రంలో కొనసాగుతుందని ఎద్దేవా చేశారు.

సంస్కారం లేని నాయకుడు 'రంజిత్‌రెడ్డి'
-ప్రకాశ్ గౌడ్, ఎమ్మెల్యే

కేసీఆర్ హయాంలో ప్రణాళికతో పరిపాలన కొనసాగిందని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ అన్నారు. ఆనాడు ఎలా ఉంది.. ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు చూస్తున్నారని తెలిపారు. పదేళ్ల హయాంలో ఏనాడు కరెంటు పోలేదు.. నీళ్లు ఆగలేదు, సంక్షేమ పథకాలు ఆగలేదన్నారు. రంజిత్‌రెడ్డి అనే వ్యక్తి మన ప్రాంతానికి చెందిన వ్యక్తి కాకున్నా పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు ఎంపీగా అభ్యర్థిత్వం ఇస్తే మన మంతా కలిసి గెలిపించుకున్నాం.. కానీ సంస్కారం లేని నాయకుడు ఆయన. అలాంటి వారికి రాజకీయాల్లో స్థానం లేదు. చేవెళ్ల ప్రజలు కలిసికట్టుగా రంజిత్‌రెడ్డిని ఓడించాలన్నారు.

కాసాని ఎంపికతోనే విజయం ఖాయమైంది
-ఎమ్మెల్సీ వాణీదేవి

చేవెళ్ల పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పేరును ఎంపిక చేసినప్పుడే దాదాపు విజయం ఖాయమైందని ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. గడిచిన పదేళ్లకాలంలో బీఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే నేటికి తెలంగాణ వ్యాప్తంగా అమలవుతున్నాయన్నారు. మూడు మాసాలు గడిచినా రేవంత్ సర్కారు ఒక్క హామీని నేరవేర్చిన దాఖలాలు లేవన్నారు. ప్రణాళిక లేకుండా పాలన సాగుతున్నదని ఇలాంటి పాలన నా జీవితంలో చూడలేదన్నారు.

96 కులాల గొంతుక 'కాసాని'
-ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం

కాంగ్రెస్ సర్కారు అధికారం చేపట్టి వందరోజులు గడిచినా ఏ ఒక్క హామీ నెరవేర్చిన దాఖలాలు లేవు. షాదీముబారక్/కల్యాణలక్ష్మీతో పాటు తులం బంగారం ఇస్తామన్నారు. మహిళలకు రూ.2500 నగదు, రూ.4వేల పింఛన్లు.. రైతు బంధు ఏమైయింది? నీళ్లు లేక వెలవెల బోతున్న వేల ఎకరాల పరిస్థితికి కారణం ఎవరని ఎమ్మెల్సీ యెగ్గే మల్లేశం సీఎం రేవంత్‌ను ప్రశ్నించారు. 96 కులాలను ఏకం చేసి బీసీ సామాజిక వర్గాలను ఏకతాటిపై తీసుకువచ్చి తమ గోడును వినిపించేందుకు కాసాని జ్ఞానేశ్వర్ ఆనాడే వేదిక సిద్ధం చేశారు. నేడు చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే ఇక్కడ ప్రజల గొంతుకై పార్లమెంటులో వినిపిస్తాడని అన్నారు.

ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన కేసీఆర్
- కాలే యాదయ్య, ఎమ్మెల్యే చేవెళ్ల

అన్నిరంగాల్లో తెలంగాణను అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌దేనని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. కాంగ్రెస్ వచ్చింది కరువు మొదలైంది. ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయి. తప్పుడు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసింది. ఎంపీ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై గులాబీ జెండా ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

కలిసి పనిచేస్తే విజయం మనదే
- దయానంద్, ఎమ్మెల్సీ

కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలంతా కలిసి పనిచేయాలని ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా అన్నారు. బీసీ సామాజిక వర్గానికి మొదటిసారిగా అవకాశం వచ్చిందని తెలిపారు. ప్రస్తుత బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు బీఆర్ఎస్‌లోని అభ్యర్థులేనని అన్నారు. చేవెళ్ల ప్రజలు గులాబీ పార్టీకే మద్దతు పలకాలన్నారు.